క్లుప్తంగా

బైక్ ఢీకొని ఇద్దరు మహిళలకు గాయాలు

మంగళగిరి టౌన్: ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరు మహిళలకు గాయాలైన ఘటన శనివారం మంగళగిరి పట్టణంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం ఎంటీఎంసీలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న ఇద్దరు మహిళలు తెనాలి ఫ్లైఓవర్ పక్కనే వున్న పిచ్చిమొక్కలను శుభ్రం చేసే క్రమంలో అటుగా వస్తున్న ఓ ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఘటనలో ఒక మహిళకు కాలు విరగడంతో పాటు తలకు బలమైన గాయమైంది. మరో మహిళకు స్వల్ప గాయాలు కావడంతో ఇద్దరు మహిళలను నగర పరిధిలోని ఎయిమ్స్ ఆసుపత్రికి స్థానికులు తరలించారు. ద్విచక్రవాహనంతో ఢీకొట్టిన యువకుడికి కూడా స్వల్ప గాయాలు కావడంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మంగళగిరి టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు వైద్య ఖర్చుల నిమిత్తం శనివారం సీఎం సహాయ నిధి నుంచి విడుదలైన ఎల్ఓసీ చెక్కులను స్థానిక టీడీపీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణం 4వ వార్డుకు చెందిన గుంజి నాగేశ్వరరావు గుంటూరులోకి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, అతని ఆర్థిక పరిస్థితి తెలుసుకుని స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 5 లక్షలు మంజూరు చేశారని, ఆసుపత్రికి వెళ్లి ఆ చెక్కును అందజేశామని తెలిపారు. తాడేపల్లి 6వ వార్డుకు చెందిన గిద్దలూరు అజయ్‌కుమార్‌కు రూ.లక్ష ఎల్‌వోసీ చెక్కు ఆయన ఇంటికి వెళ్లి అందజేశామని పేర్కొన్నారు. కోయగూర మహాలక్ష్మి, అన్నెం కుసుమ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఫిరంగిపురం: యోగాసనాల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంపీడీఓ పూషాడపు శివసుబ్రహ్మణ్యం అన్నారు. మండలకేంద్రంలోని సెయింట్‌పాల్స్ ఆడిటోరియంలో శనివారం యోగాంధ్ర–2025 కార్యక్రమంలో భాగంగా యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయడం ఒక దినచర్యగా భావించాలని చెప్పారు. తహశీల్దార్ జె.ప్రసాదరావు, ఏఓ రవిబాబు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంగం డెయిరీ దుకాణంలో చోరీ



మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని ఓ దుకాణంలో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం మంగళగిరి పట్టణానికి చెందిన మాజేటి సుబ్బసాయి పోలీస్ క్వార్టర్స్ పక్కనే సంగం డెయిరీ షాపు నడుపుకొంటున్నాడు. శుక్రవారం రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. శనివారం తెల్లవారుజామున షాపు తీయడానికి వచ్చిన సాయి షట్టర్ తాళాలు పగలకొట్టి ఉండడం గమనించి, షాపులో లోపల అన్నీ చిందర వందరగా పడి ఉండడం గమనించాడు. గల్లాపెట్టెలో వున్న రూ.6వేలు నగదు, సుమారు రూ.లక్ష విలువ చేసే రెండు సెల్‌ఫోన్లతో పాటు సిగరెట్ బండిల్స్ చోరీకి గురైనట్లు గమనించాడు. జరిగిన ఘటనపై మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్లో శనివారం ఫిర్యాదు చేశాడు. షాపులో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

తెనాలిరూరల్: బాలిక అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు పట్టణ చెంచుపేటకు చెందిన 17 ఏళ్ల బాలిక తొమ్మిదో తరగతి చదవి ఇంటి వద్దే ఉంటోంది. శుక్రవారం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా త్రీ టౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

తెనాలిటౌన్: అసమానతలు లేని సమాజ నిర్మాణం ఏర్పడాలంటే ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని గ్రేస్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ కైతేపల్లి షాలేమ్‌రాజు పేర్కొన్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా శనివారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు ప్రజాల రామలింగాచారి మాట్లాడుతూ గ్రేస్ ఫౌండేషన్ ద్వారా సమాజానికి సేవలందిస్తున్న షాలేమ్ రాజు రాబోయే రోజుల్లో మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కనకల మధుసూదన్‌ప్రసాద్, గొట్టిపాటి భానుగంగాధర్, ఇందుపల్లి రాజారాం, సుద్దపల్లి మురళీధర్, సాపాటి శ్రీనివాసరావు, కొండముది రమేష్, అత్తోట రమేష్, మేకల సురేష్, వై.కోటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

వేసవి దుక్కులతో మేలు

- దుక్కులతో నేల సారవంతం
- తేమశాతం పెరిగి భూసారం వృద్ధి
- చీడపీడల నివారణ



తాడేపల్లి రూరల్: రబీ తర్వాత తిరిగి వర్షాకాలం వచ్చేవరకు చాలామంది రైతులు అవగాహన లేక భూమిని దున్నకుండా అలాగే వదిలేస్తారు. దీంతో భూమిలో కలుపుమొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి భూమికి సత్తువ లేకుండా చేస్తాయి. అదే వేసవిలో లోతుగా దుక్కులు దున్ని పెడితే బోలెడు లాభాలు ఉన్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. లోతు దుక్కులతో భూమి పై పొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. వేసవి కాలంలో లోతు దుక్కులతో చాలా ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. వర్షాలకు ముందు భూమిని దున్నడం వల్ల తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి కోతకు గురికాకుండా ఉంటుంది. దీంతో భూమిలో తేమశాతం పెరిగి భూసారం వృద్ధి చెందుతుంది. పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, కలుపు మొక్కల నివారణతో పాటు ఎక్కువ ప్రయోజనాలు సమకూరుతాయి.

కలుపు మొక్కలు నాశనం..

వేసవి లోతు దుక్కులు దున్నే ముందు పశువులు, ఆవులు, గొర్రెల పేడ, కంపోస్టు, ఎరువు, మట్టిని వెదజల్లడం ద్వారా భూమి సారవంతమై పంట దిగుబడి పెరుగుతుంది. లోతు దుక్కులు నేలను చదును చేసే పనులే కాకుండా వేసవిలో వచ్చే జల్లులు, తొలకరి వర్షాలకు ఉపయోగించుకుని నేల అవసరాన్ని బట్టి పై పొరల్లోకి కలుపు విత్తనాలు చాలా వరకు మొలక దశలోనే అంతరించిపోతాయి. ఇతర కలుపు జాతులైన ఊద, చిప్పెర, ఉర్రంగి, నేల ఉసిరి తదితర మొక్కలుంటే లోతు దుక్కులు దున్నడం వల్ల నశిస్తాయి. ఆరు తడి పంటగా వరి సాగు చేసినప్పుడు, పత్తి, మిరప, మొక్కజొన్న, మినుము, పెసర తదితర పంటల సాగుకు ముందే వేసవిలో లోతు దుక్కులు దున్నకోవాలి. ఎండకు సైతం భూమి పొరల్లోకి చొచ్చుకుని వెళ్ళి క్రిమి కీటకాలను నాశనం చేస్తుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

లోతైన దుక్కులతో పెరగనున్న భూసారం

రైతులు వేసవి వెళ్లక ముందే లోతైన దుక్కులు దున్నాలి. పొలానికి అడ్డంగా దున్నడంతో భూమిలోని చీడ పురుగులు నశించిపోతాయి. తగినంత తేమ ఉన్నప్పుడు దుక్కులు వాలుగా లోతుగా దున్నితే నేల కోతకు గురవకుండా ఉంటుంది. దున్నిన తరువాత రైతులు పంట సాగుకు వేపగింజల మిశ్రమాన్ని చేలో పిచికారీ చేయాలి. దీంతో క్రిమి కీటకాలు పంటను ఆశించవు. క్రిమి సంహారక మందులు వాడకుండా ఉండడమే మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

రైతులు నేలలో లభ్యమయ్యే పోషకాలపై అవగాహన పెంచుకోవడం వలన ఏ నేలలో ఏ పంట వేస్తే మంచి దిగుబడులు వస్తాయో తెలుసుకని పంట వేయడం వలన ఆశించిన దిగుబడులు సాధించవచ్చు. ప్రతి రైతు వారి పొలంలో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. భూసార పరీక్షల వల్ల భూమిలోని పోషక విలువలు తెలియడంతో పాటు పంటల దిగుబడులకు అవసరమైన ఎరువులను ఏ మోతాదులో వాడాలో రైతులు తెలుసుకోవడానికి వీలు కలుగుతుంది. తద్వారా పంట సాగు ఖర్చులు కూడా తగ్గవచ్చు.

పచ్చి రొట్ట పైర్లు సాగు చేయాలి



పచ్చిరొట్ట పైర్లు అయిన పిల్లిపెసర, జనుము, జీలుగ దుక్కుల అనంతరం పొలాల్లో వేయడం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయి. ఖరీఫ్ సీజన్‌లో పండించే వరికి, రబీ సీజన్‌లో పండించే మినుము, పెసర, మొక్కజొన్న, తెల్ల జొన్న పంటల్లో చీడ పీడలను తట్టుకునే శక్తి ఈ పచ్చిరొట్ట పైర్లు వేసిన పొలాల్లో ఎక్కువగా ఉంటుంది.

– శిరీష, వ్యవసాయ అధికారిణి, దుగ్గిరాల

హెల్మెట్ ధారణపై స్పెషల్ డ్రైవ్



తాడేపల్లిలో వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కల్యాణ్‌రాజ్



ఫిరంగిపురంలో హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పిస్తున్న సీఐ కె.శివరామకృష్ణ



వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న మంగళగిరి టౌన్ సీఐ వీరాస్వామి

మంగళగిరి టౌన్: హెల్మెట్ ధరించడంపై తాడేపల్లి పోలీసులు శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజ్ ఆధ్వర్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాడేపల్లి పట్టణ పరిధిలోని మణిపాల్ హాస్పిటల్ వద్ద హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన దారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం వల్ల 80 శాతం ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, ఇలాంటి మరణాలు జరగకూడదనే ఉద్దేశ్యంతో తనిఖీలు చేయడంతో పాటు వాహనదారులకు హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వాహనదారులు హెల్మెట్‌తో పాటు వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. తాడేపల్లి ఎస్ఐలు, ట్రాఫిక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి..

ఫిరంగిపురం: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రాణాలకు రక్షణ కలగాలంటే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ కె.శివరామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని సొలసబ స్టాండు సెంటర్‌లో శనివారం సాయంత్రం వాహన తనిఖీలు చేశారు. సిబ్బందితో ఆటో, కారు, ద్విచక్రవాహనాలను పరిశీలించారు. పాత చలానాలు చెల్లించకుండా ఉండని వారిని గుర్తించి వారిచే చలానాలు కట్టించుకున్నారు. లైసెన్సు, వాహన పర్మిట్ లేకుండా, సరైనా పత్రాలు లేకుండా వాహనాలు నడపడం నేరమని చెప్పారు. సరైన పత్రాలులేని వాహనాలకు జరిమాని విధించనున్నట్లు తెలిపారు. అనంతరం ద్విచక్ర వాహనచోదకులకు హెల్మెట్ ధరించడంవల్ల కలిగే ప్రయోజనాలు గురించి అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం కోరి ప్రమాదాలను కొని తెచ్చుకోవడమే అవుతుందని తెలిపారు. కారులో ప్రయాణించేవారు తప్పనిసరిగా సీట్ బెల్టును పెట్టుకోవాలని చెప్పారు. ఎస్ఐ పి.సురేష్, ఏఎస్ఐలు మొహిద్దీన్, పఠాన్ ఖాన్, రైటర్ దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి..

మంగళగిరి టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని మంగళగిరి పట్టణ సిఐ వీరాస్వామి సూచించారు. మంగళగిరి నగర పరిధిలోని వివిధ ప్రాంతాల్లో శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. సుమారు 40 వాహనాలకు సుమారు రూ.25,000 వరకు ఫైన్ వేశారు. ఈ సందర్భంగా సీఐ వీరాస్వామి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఎస్ఐలు హరిబాబు, రవీంద్రనాయక్, క్రైమ్ సిబ్బంది బాబూరావు, సిబ్బంది శ్రీరామ్, గంగరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కాళ్లు పంపిణీ



మంగళగిరి టౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో శ్రీపాదం పేరుతో దివ్యాంగులకు ప్రభ పుట్ కృత్రిమ కాళ్ల పంపిణీ కార్యక్రమం మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ కళాశాలలో శనివారం నిర్వహించారు. రెండవ రోజు జరిగిన ఈ శిబిరంలో 35 మంది దివ్యాంగులకు ప్రభ పుట్ కృత్రిమ కాళ్లను అమర్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులకు వారు కోల్పోయిన కాలి కొలతల ఆధారంగా కృత్రిమ కాళ్లను రూపొందించి అమర్చడమే కాకుండా ఎలా నడవాలో తర్ఫీదు ఇచ్చారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ సాధారణ కృత్రిమ కాళ్ల కంటే ప్రభ పుట్ కాళ్లు ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు గాజుల శ్రీనివాసరావు, అందె మురళీమోహనరావు, ప్రాజెక్ట్ చైర్మన్ అనీల్ చక్రవర్తి, క్లబ్ డైరెక్టర్లు పారేపల్లి నిరంజన్ గుప్త, శ్రీనివాసరావు, ప్రగడ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు కృషి చేయాలి



దుగ్గిరాల: కేవలం ఆర్డినెన్స్‌తో సరిపెట్టకుండా చట్టం చేసి, వర్గీకరణకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మార్పీఎస్ ఏపీ స్టేట్ లీగల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ పేర్కొన్నారు. చిలువూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుతో కుమ్మక్కైన మంద కృష్ణ, మాదిగ జాతికి తీవ్ర ద్రోహం చేస్తున్నాడని దుయ్యబట్టారు. సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పుకు విరుద్ధంగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఆర్డినెన్సు రోస్టర్ విధానం తెచ్చి, బాగా అభివృద్ధి చెందిన మాల సామాజిక వర్గానికి అదనపు లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తూ, మంద కృష్ణ మాదిగ మాదిగలను చంద్రబాబుకు తాకట్టు పెడుతున్నారని అన్నారు. ఉరుసుపాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో రాజీలేని పోరాటాలు చేస్తూ వర్గీకరణ చట్టబద్ధతకు తాము కృషి చేస్తామని తెలిపారు. పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా తాళ్లపాక అన్నమాచార్య జయంత్యుత్సవం



బ్రహ్మశ్రీ మల్లాది సూరిబాబుకు సత్కారం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. గాయత్రి మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఊపిరితిత్తుల వైద్యనిపుణులు డాక్టర్ శ్రీకంఠి రఘు, మైథిలి దంపతులు, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, భూసురపల్లి వెంకటేశ్వర్లు జ్యోతిప్రజ్వలతో ప్రారంభించారు. అనంతరం కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత మల్లాది సూరిబాబును సత్కరించారు. మల్లాది సోదరులు శ్రీరామప్రసాద్, రవికుమార్ (విజయవాడ) శాస్త్రీయ సంగీత గాత్ర యుగళ కచేరీ అలరించింది. సంగీత త్రిమూర్తుల కీర్తనలు, అన్నమయ్య కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. కార్యక్రమంలో మండలి అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, ప్రధాన కార్యదర్శి ఎంవై శేషరాణి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితాదేవి, కార్యదర్శి ఏవీ మంగాదేవి, కోశాధికారి విజయలక్ష్మి సత్కరించారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయుడు చేగువేరా

తెనాలిటౌన్: స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో చేగువేరా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు పాల్గొని చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్య వ్యతిరేక సింహస్వప్న, పోరాటాల స్ఫూర్తి ప్రధాత చేగువేరా జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జూన్ 14వ తేదీ చేగువేరా జయంతిగా తెలిపారు. వైద్య విద్యనభ్యసించి మోటార్ సైకిల్‌పై ప్రపంచ యాత్రచేశారని గుర్తు చేశారు. పేదరికాన్ని నిర్మూలించాలనే ఆలోచనతో అనేక పోరాటాలు చేసినట్లు వెల్లడించారు. నేటి యువత విద్యార్థులు చేగువేరా భావజాలాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గద్దె శివ, ఎం.కిరణ్‌బాబు, కె.రవితేజ, కోలా శేఖర్, తేజ, హకీం, రాహుల్, అరుణ్, సాయి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై అదనపు విద్యుత్ భారం

సీపీఎం పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్

తెనాలిటౌన్: కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారం చేపట్టి ప్రజలపై మోయలేని భారాలను మోపుతుందని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ ఆరోపించారు. శనివారం స్థానిక చెంచుపేటలోని మార్కెట్ యార్డు, సివిల్ సప్లయిస్ గొడౌన్ ప్రాంతాల్లో పర్యటించిన కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఏడాది కాలంలో ప్రజలపై మోపిన పన్నుల భారం వివరించారు. రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. విద్యుత్ బిల్లుల భారాన్ని కార్మికులకు వివరించారు. ఇంటి పన్నుల పేరుతో విధిస్తున్న అదనపు భారాన్ని తెలియజేశారు. కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ వేస్తూ పేదల జేబులు చిల్లుపెడుతున్నారని కూటమి ప్రభుత్వంపై నిప్పులు చేరిగారు. కార్యక్రమంలో జి.బాబురావు, టి.వీరయ్య, జి.యోహాన్, నరసింహారావు, కమలకరరావు, శివయ్య, ఏలియా, సుశీలరావు, వీరాంజనేయులు, సుధాకర్, బంగారుబాబు, పోతురాజు, రవికుమార్, తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికులకు పథకాలు అమలు చేయాలి



ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, యూనియన్ నాయకులు

మంగళగిరి టౌన్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు అన్ని ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య డిమాండ్ చేశారు. ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట శనివారం పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తల్లికి వందనం పథకం మున్సిపల్ కార్మికులకు రాకపోవడంతో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా చెంగయ్య మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీల మేరకు మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయడం లేదని విమర్శించారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పారిశుద్ధ్య కార్మికులు ప్రజలకు సేవ చేశారన్నారు. తల్లికి వందనం పథకం కార్మికులకు వర్తింపజేయకపోవడం దారుణమని, ప్రభుత్వ పథకాలన్నీ పారిశుద్ధ్య కార్మికులకు వర్తింపజేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. అనంతరం ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్ మున్సిపల్ కార్మికులలో ఎవరెవరికి తల్లికి వందనం పథకం నగదు జమకాలేదో వారి వివరాలను ఇవ్వాలని కోరారు. యూనియన్ నాయకులు వెంకటేశ్వరమ్మ, శివనాగేశ్వరరావు, తిరుపతమ్మ, నాగార్జున, మేరీ తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



దీక్షా శిబిరంలో నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ నాయకులు

మంగళగిరి టౌన్: మంత్రి లోకేష్ చొరవ తీసుకుని, ఏసీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ పేర్కొన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు శనివారంతో 193వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కార్మికులకు మద్దతు తెలియజేసి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నారా లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినపుడు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీఇచ్చారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులను సమస్యను పరిష్కరించి, కార్మికుల ఖాతాల్లో కూడా డబ్బులు జమచేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. శారద, సువర్ణకుమారి, రమణమ్మ, రమణ, హగ్గయ్య, సుబ్బారావు, ఆశీర్వాదం, బాషా, నాగేశ్వరరావు, సాంబశివరావు, ఇమాంబి, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



కుండలోని నీటిని పారబోస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఫిరంగిపురం: మండలంలోని ఫిరంగిపురం పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. నీటి కుండలు, తొట్టెల్లో నీటిని ప్రతి నాలుగు రోజులకో మారు శుభ్రంగా కడిగి పోసుకోవాలని చెప్పారు. కాలువల్లో మురుగునీటి పారుదల సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, మురుగు నిలవకుండా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం రానుండటంతో దోమలు ఉధృతి ఎక్కువగా ఉంటుందని వాటిని అరికట్టేందుకు కొబ్బరిబోండాలు, పాతటైర్లలో నీరునిలువ లేకుండా చూడాలని చెప్పారు. కొందరి ఇళ్లవద్ద మురుగునీరు ఉండటాన్ని గమనించి పారబోయించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

మేడికొండూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ సూచించారు. మండల పరిధిలోని పేరేచర్ల గ్రామంలో శనివారం గ్రామ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శుభకార్యాలకు వెళ్లే వారు, ముఖ్యంగా మహిళలు బంగారు ఆభరణాల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులను ఉపయోగించకుండా ఓటీపీలను ఎవరికీ తెలియజేయకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. ప్రజలు ఎవరైనా సుదూర ప్రాంతాలకు వెళ్తే తప్పనిసరిగా పోలీసు వారికి సమాచారం ఇవ్వాలన్నారు. వారి ఇళ్లకు భద్రత కల్పించే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. మేడికొండూరు ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో పాల్గొన్న కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం, డాక్టర్ సౌభాగ్యవాణి

తెనాలిటౌన్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సుమారు స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు రక్తదాతలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ జి.రాధబాయ్ పాల్గొని రక్తదాతలపై ప్రతిజ్ఞ చేయించారు. సత్యం, శివం, సుందరం సేవా కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ మాట్లాడుతూ రక్తం కొరత తీవ్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో యువత రక్తదానంపై అవగాహన పెంపొందించుకుని ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం, వైద్య శాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, మాలేపాటి హేమకుమార్, షేక్ షఫీ, అన్నం రవి, నాగమోతు నారాయణ, లోకేష్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ఎం.బాపనయ్య, రమాదేవి, శ్యామాల, శ్రీను ఉన్నారు.

అనధికార వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగర పలక సంస్థ పరిధిలోని శానిటరీ డివిజన్ల వారీగా ప్రజారోగ్య కార్మికుల దగ్గర అనధికారిక నగదు వసూళ్లు జరగకూడదని, చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో పారిశుద్ధ్య నిర్వహణపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని బిన్ ఫ్రీ సిటీగా చేయడానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కృషి చేయాలన్నారు. రానున్న 15 రోజుల్లో నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపడకపోతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణకు సోమవారం నుంచి ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తాయని పేర్కొన్నారు. నగరంలో రోడ్డు మార్జిన్లు, డ్రెయిన్లు ఆక్రమణలకు గురికాకుండా ఉండాలంటే పట్టణ ప్రణాళిక, పబ్లిక్ హెల్త్ అధికారులు, సిబ్బంది కో ఆర్డినేషన్‌తో పని చేయాలని కోరారు. కార్మికుల దగ్గర అనధికారికంగా నగదు తీసుకొని హాజరు వేస్తున్నారని అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, ఈ విధంగా అందిన ఫిర్యాదులను పరిశీలించి, అటువంటి వారిపై తీవ్ర చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు. నగరంలో రోడ్లపై ప్రజలు చెత్త వేయకుండా అవగాహన కలిగించాలని, పదే పదే చెత్త వేస్తుంటే సదరు ప్రాంతాలలో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. నగరంలో పారిశుద్ధ్య మెరుగుదలకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు అవసరమైన మ్యాన్ పవర్, చెత్త తరలింపు ట్రాక్టర్లను అందజేస్తామని వివరించారు. సమావేశంలో సీఎంహెచ్‌ఓ డాక్టర్ అమృతం పాల్గొన్నారు.